# నిలిచిన ఐటీడీఏ ఇండ్ల నిర్మాణం

- అడ్డుకుంటున్న అటవీ శాఖ అధికారులు
- నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారుల విన్నపం

పెంబి, ఏప్రిల్ 12 : నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ నిర్మిస్తున్న ఇండ్లు మధ్యంతరంగా నిలిచిపోయాయి. అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతోనే ఇండ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెంబి మండలంలోని జంగన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పూలాజీబాబా గూడెంలో 10 ఇండ్లు, తాటిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలంగూడలో 10 ఇండ్లు, దయ్యాలమద్ది గ్రామంలో 9 ఇండ్లు, పుల్గంపాండ్రిలో 6 ఇండ్లు మంజూరయ్యాయి. ఒక్కొక్క ఇల్లుకు రూ.2.5 లక్షలు నిర్మించి ఇవ్వడానికి రెండు సంవత్సరాల క్రితం నిధులు మంజూరయ్యాయి, ఇందులో భాగంగా జంగన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పూలాజీబాబా గూడెంలో 10 ఇండ్లు పిలర్లు వేశారు. అయితే అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతో పిల్లర్ల దశలోనే ఇండ్లు నిలిచిపోయాయి. మిగతా గ్రామాల్లో పునాది దశలో పనులు నిలిపివేశారు. ఇండ్ల నిర్మాణ పనులు మధ్యంతరంగా నిలిపివేయడంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇండ్లు నిర్మించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పూలాజీబాబా గూడెంలో పిల్లర్ల దశలో నిలిచిపోయిన ఇల్లు

### అటవీ అధికారుల అడ్డగింతతో ఇండ్ల నిర్మాణాలు నిలిపివేశాం

పీవీటీజీ గ్రామాల్లో ఒక్కొక్క ఇంటికి రూ. 2.5 లక్షలతో నిర్మించి లబ్ధిదారులకు అందజేస్తున్నాము. మండలంలోని జంగన్‌గూడ జీపీలోని పులాజీబాబా గూడెంలో 10 ఇండ్లకు పిల్లర్లు వేశాము. ఈ గ్రామం ఆర్ఓఎఫ్ఆర్ ల్యాండ్‌లో ఉందని అటవీ శాఖ అధికారులు ఇండ్ల నిర్మాణాలను మధ్యంతరంలో నిలిపివేశారు. తాటిగూడ, పుల్గంపాండ్రి, దయ్యాలమద్ది గ్రామాల్లో కూడా ఇండ్ల నిర్మాణాలు నిలిపివేశారు. అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇస్తే ఇండ్ల నిర్మాణాలు ప్రారంభిస్తాం.

-రాజేశ్, ఐటీడీఏ ఏఈ

### అనుమతులు ఇప్పించి ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



నాపేరు ఆత్రం రాధ జంగన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పులాజీబాబా గూడెంలో కట్టెలతో నిర్మించుకున్న గుడిసెలో ఉంటున్నాము. ఐటీడీఏ నుంచి ఇల్లు మంజూరైందని అధికారులే నిర్మించి ఇస్తారని చెప్పడంతో సంతోషపడ్డాం. ఐటీడీఏ అధికారులు ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించి పిల్లర్లు వేశారు. అటవీ శాఖ అధికారులు వచ్చి పనులను మధ్యలో నిలివేశారు. ఉన్నతాధికారులు స్పందించి అటవీ శాఖ నుంచి అనుమతులు ఇప్పించి ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని వేడుకోంటున్నాము.

-ఆత్రం రాధ, పులాజీబాబాగూడెం

### ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



నాపేరు ఆత్రం భీంరావ్, పూలాజీబాబాగూడెంలో కట్టెల గుడిసెలో నివసిస్తున్నాము. ఐటీడీఏ నుంచి ఇల్లు వచ్చిందంటే సంతోషమేసింది. కానీ అటవీ శాఖ అధికారులు ఇండ్ల నిర్మాణాలను మధ్యలో ఆపేయడంతో చాలా బాధ కలిగించింది. ఉన్నతాధికారులు ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

-ఆత్రం భీంరావ్, పూలాజీబాబాగూడెం



# పచ్చటి పరదానే ప్రహరీ

పాఠశాలకు ప్రహరీగా ఏర్పాటు చేసిన పచ్చటి పరదా

ముథోల్, ఏప్రిల్ 12 : నిర్మల్ జిల్లా ముథోల్‌లోని పాత బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఒకే ప్రాంగణంలో ఉన్న రెండు ప్రాథమిక బాలికల పాఠశాలలు ఉన్నాయి. సంవత్సరం క్రితం నూతన భవనం మంజూరు కావడంతో పాతది తొలగించారు. దాని స్థానంలో నూతన భవనం ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో పాఠశాల ఆవరణలో దుమ్ముధూళి చేరుతుంది. అలాగే పాఠశాలను కొనసాగించాల్సి వస్తుంది. అప్పటి నుంచి పాఠశాలకు పచ్చటి పరదానే ప్రహరీగా ఉండడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# హనుమాన్ శోభాయాత్రకు బందోబస్తు

ఎదులాపురం, ఏప్రిల్ 12 : ఆదిలాబాద్‌లో నిర్వహించే హనుమాన్ శోభాయాత్రకు 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం స్థానిక సెంట్రల్ గార్డెన్‌లో బందోబస్తు సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. హనుమాన్ ర్యాలీ సందర్భంగా ప్రత్యేకంగా వీడియో కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి బందోబస్తు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో సిబ్బందిని సెక్టర్ల వారిగా విభజించి బందోబస్తు ప్రక్రియను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బందోబస్తులో ముఖ్యంగా శోభాయాత్ర సంచరించి దారి పొడవున ఉన్న భవనాలపై రూఫ్‌టాప్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ర్యాలీ తీసే ప్రదేశాలలో ట్రాఫిక్ డైవర్షన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని తెలిపారు. బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ అదనపు ఎస్పీ సురేందర్ రావ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం


కుభీర్: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం శోభ, తిప్ప అరుణ


ఖానాపూర్‌రూరల్: తర్లపాడులో సామూహిక సీమంతాలు చేస్తున్న సిబ్బంది

కుభీర్, ఏప్రిల్ 11: మహిళలు తమ ఆరోగ్య పరిరక్షణకు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని గోడ్సర పల్లె దవాఖాన ఏఎన్ఎం శోభ, కస్ర అంగన్‌వాడీ టీచర్, టీచర్ల మండలాధ్యక్షురాలు తిప్ప అరుణ సూచించారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం కస్ర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మహిళలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యం-సంరక్షణ, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు పాల్గొన్నారు.

### గర్భిణులకు సామూహిక సీమంతాలు

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషణ పక్షోత్సవంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్ సుకన్య, స్వాతి, రాజేశ్వర్, సుజాత, అరుణ, సౌజన్య పాల్గొన్నారు.

# కేసీఆర్ ప్రభుత్వంలోనే రైతులకు మేలు

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి, ఏప్రిల్ 12 : కేసీఆర్ ప్రభుత్వంలోనే 24 గంటల ఉచిత కరెంట్ అందించి మేలు జరిగిందని నిండు సభలో రైతులే అంటున్నారని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని జామిడి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సన్మాన సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. జామిడి ఉత్తమ రైతులను శాలువాలతో సన్మానించారు. అనంతరం అభివృద్ధి పనుల్లో భాగంగా షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరించి రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, అనేక సంక్షేమ పథకాలు అందించడంతో రైతులు ఆర్థికంగా ఉత్తమంగా ఎదిగారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ వినోద్ రెడ్డి, తాంసి మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, నాయకులు మహేందర్, అశోక్, అరుణ్ కుమార్, లక్ష్మీపతి, రమణ, భూమన్న, జామిడి రైతులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# వనజీవి రామయ్య జీవితకాలం ఆదర్శం

ఎదులాపురం, ఏప్రిల్ 12: ఖమ్మం జిల్లాకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మృతి పట్ల మాజీ అటవీ శాఖ మంత్రి జోగు రామన్న సంతాపం వ్యక్తం చేశారు. తన జీవితకాలం చెట్లను గౌరవిస్తూ కోట్ల సంఖ్యలో మొక్కలు నాటడమే కాకుండా, చెట్లకు పూజ చేయడం వంటి ఎన్నో స్ఫూర్తిదాయకమైన ఆయన జీవితం ఆదర్శనియమని కొనియాడారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

### తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్య

కడెం, ఏప్రిల్ 12 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన రాసూరి రాజేశ్వర్ కూతురు అనూష ఉరి వేసుకుని అత్మహత్య చేసుకుంది. తండ్రి రాజేశ్వర్ వివరాల ప్రకారం.. తన కూతురు చిన్ననాటి నుంచి సున్నితమైన మనస్సు కలిగి ఉండేదని, ఇదే విషయమై తన భార్య కూతురిని మందలించడంతో మనస్థానికి గురైన అనూష శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

### ఇద్దరిపై కేసు

సోన్, ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా సోన్ మండలం గంజాల్ గ్రామంలోని వడ్డెర కాలనీలో నివసిస్తున్న నాగమణి తన ఇంటి ముందు నిద్రపోతున్న సమయంలో అదే కాలనీకి చెందిన శ్రీకాంత్, సాయిలు ఆమె మంచంపై రాయి పడవేయడంతో ఆమెకు గాయాలు కాగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే గోపి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... నాగమణి నిద్రపోతున్న సమయంలో రాయిని పడవేసి పరగెత్తగా ఆమె వెంటనే మేల్కోని చూసి తన కులస్తులైన శ్రీకాంత్, సాయిలు గుర్తుపట్టన్నానని, పాత గొడవలు మనసులో పెట్టుకొని రాయిని పడవేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### విద్యుత్ సబ్ మెర్సిబుల్ మోటర్లు చోరీ

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 12 : పంటలకు సాగునీరు అందించేందుకు రైతులు తమ పొలాల్లోని బోరుబావులకు అమర్చిన రెండు విద్యుత్ సబ్ మెర్సిబుల్ మోటర్లు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు గాండ్ల రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ శివారులో వరికి సాగునీరు అందించేందుకు 5 హెచ్‌పీ సామర్థ్యం గల మోటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. రోజులాగే శుక్రవారం రాత్రి పంటకు తడి అందించేందుకు పొలానికి వెళ్లి మోటర్ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా విద్యుత్ వైర్లు, స్టార్టర్ కనిపించలేదు. దీంతో మోటర్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. పక్కనే ఉన్న మరో రైతుకు సంబంధించిన 5 హెచ్‌పీ సామర్థ్యం గల మోటర్ చోరీకి గురైంది. చోరీకి గురైన రెండు మోటర్ల విలువ రూ. 45వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

### గంజాయి పట్టివేత

బోథ్, ఏప్రిల్ 12 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని నిగిని గ్రామానికి చెందిన ప్రభు పెందూర్ ఇంటి వద్ద శనివారం గంజాయిని పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్ రావ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. తమకు వచ్చిన సమాచారం మేరకు నిగిని గ్రామానికి చెందిన ప్రభు పెందూర్ ఇంట్లో సోదాలు నిర్వహించగా 1 కిలో 450 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. దీని విలువ రూ.36,250 ఉంటుందని పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి పట్టుకున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుళ్లు అంబాజీ, రంజిత్ కుమార్, నరేశ్‌ను డీఎస్పీ జీవన్ రెడ్డి అభినందించారు.

### మొక్కజొన్న పంట దగ్ధం


దగ్ధమైన మొక్కజొన్న పంట

ఇచ్చోడ, ఏప్రిల్ 12 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామ శివారు ప్రాంతంలో తోరే సుభాష్ అనే రైతు పొలంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రెండు ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధమైంది. 80 క్వింటాళ్ల వరకు పంట నష్టపోయినట్లు బాధితుడు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

### క్షతగాత్రులకు భైంసా ఏరియా దవాఖానలో చికిత్స

భైంసా, ఏప్రిల్, 12 : నిర్మల్ జాతీయ రహదారి 6 పై తురాటి బస్టాండ్ ఎక్స్ రోడ్డు వద్ద బస్సు- లారీ ఢీ కొనడంతో గాయపడిన బాధితులు శనివారం భైంసా ప్రభుత్వ దవాఖానకు చికిత్స నిమిత్తం వచ్చారు. గం గవ్వ, సుక్క గంగవ్వ, భారతి, విమల, లక్ష్మి, భోజవ్వకు గాయాలు కాగా వీరికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

### పార్డి(బీ) గ్రామైఖ్య సంఘం కార్యవర్గం

కుభీర్, ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(బీ) గ్రామైఖ్య సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం సంఘ భవనంలో జరిగిన డ్వాక్రా సంఘాల మహిళల సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బ్యారపు లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా కాంతాబాయి. ప్రధాన కార్యదర్శిగా జ్యోతి, సహాయ కార్యదర్శిగా చిట్యాల రాణి, కోశాధికారిగా గుమ్మల లావణ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ దత్తాత్రి, వీవోఏ సాయినాథ్, మహిళలు పాల్గొన్నారు.

### ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

కడెం, ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట గ్రామంలోని హనుమాన్ ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరు కాగా పనులను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు ఆదివాసీ ప్రధాన్ సమాజ్ జిల్లా సమావేశం

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 12: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కాగ్నే ఫంక్షన్ హల్‌లోఆదివారం ఆదివాసీ ప్రధాన్ సమాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఆదివాసీ ప్రధాన్ సమాజ్ కుల పెద్దలు గేడం జ్ఞానేశ్వర్, ఆర్కా ఖమ్ము, గేడం భరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని ఆదివాసీ ప్రధాన్ సమాజ్ కుల పెద్దలు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామపటేళ్లు, యువత, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సోయం మురహరి, పెందూర్ ఆంకుశ్ పాల్గొన్నారు.

### 21న ఐటీఐ అప్రంటీస్ మేళా

ఉట్నూర్, ఏప్రిల్ 12: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆదిలాబాద్‌లో ఈ నెల 21వ తేదీన ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఉట్నూర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు www. apprentieship .india.gov.in ద్వారా రిజిస్టేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు మేళాకు హాజరుకావడానికి రిజిస్టేషన్ కాపీ, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఐటీఐ పాస్ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. అప్రంటీషిప్ కల్పించడానికి డైనమిక్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఐటీసీ ఫుడ్ డివిజన్ హైదరాబాద్, ఎల్అండ్‌టీ పూణే, రాణస్త్ర ఇంజిన్ వాల్యు లిమిటెడ్ హైదరాబాద్, ఎల్‌జీ, కంపనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

### ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

ఎదులాపురం, ఏప్రిల్ 12: ఆదిలాబాద్‌లోని కలెక్టర్ చౌక్, ఆర్టీసీ బస్టాండ్, నేతాజీ చౌక్, పంజాబ్ చౌక్, తిరుమల పెట్రోల్ బంక్‌ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ మొయిస్ పేర్కొన్నారు. ఈ విషయమై శనివారం ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ సిగ్నల్స్ ఎంతో అవసరమని కోరారు.

### ఆర్థిక సాయం

కుంటాల, ఏప్రిల్ 12 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని ఓలాలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కార్పెంటర్లు రాజశేఖర్, రాకేశ్, రంజిత్‌కు శనివారం ఓలా, నిర్మల్ మిత్ర బృందాలు విరాళాలు సేకరించి రూ.75వేలు సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాలం శ్రీనివాస్, అశోక్ కుమార్, గాజుల దేవీదాస్, రామేశ్వర్, షేక్ హుస్సేన్, శ్రీనివాస్ గౌడ్, కట్ట రవి, కూస శంకర్, నర్సయ్య, వినోద్, యువ చైతన్య యూత్ సభ్యులు వేముల సాయి, అమృత్, గజేందర్, విజయ్, హరీశ్, అక్షయ్ పాల్గొన్నారు.

### జిల్లాకు చేరిన ఏకరూప దుస్తుల వస్త్రం


వస్త్రాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 12: 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేయాల్సిన ఏకరూప దుస్తుల వస్త్రం నిర్మల్ జిల్లాకు చేరిందని డీఈవో రామారావు తెలిపారు. జిల్లాలోని 48,874 మంది విద్యార్థులకు సంబంధించిన ఏకరూప దుస్తుల వస్త్రం జిల్లాకు రాగా.. రెండు జతలకు సంబంధించిన వస్త్రం రావాల్సి ఉండగా ఒక జత వస్త్రం వచ్చిందని పేర్కొన్నారు. జిల్లాలోని 19 మండలాలకు రెండు రోజుల్లో సరఫరా పూర్తి చేస్తామని తెలిపారు.



తలమడుగు: సుంకిడి హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

### ఘనంగా హనుమాన్ జయంతి

జైనథ్/బోథ్/ఇచ్చోడ/నేరడిగొండ/భీంపూర్/తాంసి/తలమడుగు/ఉట్నూర్/ఇంద్రవెల్లి/నిర్మల్‌అర్బన్\సోన్/లక్ష్మణచాంద/భైంసా/ముథోల్/తానూర్/కుభీర్/ఖానాపూర్/ఖానాపూర్‌రూరల్, ఏప్రిల్ 12: హనుమాన్ చిన్న జయంతి వేడుకలు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ నామస్మరణతో మారుమోగాయి. పలు చోట్ల నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


ఖానాపూర్: ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జాన్సన్ నాయక్

# అపూర్వ పాలిటెక్నిక్ సమ్మేళనం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎదులాపురం, ఏప్రిల్ 12: ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ బండి రాంబాబు ఆధ్వర్యంలో శనివారం మొట్టమొదటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1980లో కళాశాల స్థాపన నుంచి నేటి వరకు పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థులందరికీ అల్యూమ్ని మొట్టమొదటి మీట్ నిర్వహించారు. అప్పటి నుంచి 40కి పైగా పూర్తయిన బ్యాచ్‌ల నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఆయా జిల్లాల నుంచి 600 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. 45 ఏళ్ల తర్వాత స్నేహితులు కలుసుకోవడంతో ఒకరిని ఒకరు గుర్తు పట్టలేదు. తమకు పాఠాలు బోధించిన అధ్యాపకులు పాల్గొనడంతో కళాశాల ప్రాంగణమం ఆనాటి జ్ఞాపకాలతో సందడిగా మారింది. అనంతరం విద్యార్థులతో కళాశాల ప్రాంగణంలో వారితో గుర్తుగా మొక్కలు నాటించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలు, జ్ఞాపకాలు పంచుకున్నారు. కళాశాలకు తమ వంతుగా సహాయం చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ పూర్వ విద్యార్థి పురాణం సతీశ్ రూ.లక్ష అల్యూమ్నికి ప్రకటించారు. అలాగే 1999 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించారు. అనంతరం పలువురు ప్రిన్సిపాళ్లు, పూర్వ ప్రిన్సిపాళ్లను సన్మానించారు. ఈ సమ్మేళనానికి 2002 బ్యాచ్‌కు సంబంధించిన ఇద్దరు పూర్వ విద్యార్థులు లండన్, ఖాతర్ దేశాల నుంచి వచ్చారు. గోల్డెన్ జూబ్లీ ఫంక్షన్ లోపు కళాశాల అభివృద్ధికి పాటుపడుతామని విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు అభయ్ రాజ్, కార్యదర్శిగా ఉమ శంకర్, కోశాధికారిగా విజయ్ బాబు, పూర్వ ప్రిన్సిపాల్, పాఠాలు బోధించిన అధ్యాపకులు, కమిటీ సభ్యులు, కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- 19 మందికి గాయాలు
- లారీ డ్రైవర్ మృతి

నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జీ) మండలం తురాటి ఎక్స్ రోడ్డు వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లోకేశ్వరం మండలం రాజురా నుంచి నిర్మల్ వెళ్తున్నది. నిర్మల్ నుంచి భైంసాకు అతివేగంగా వెళ్తున్న లారీ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో జాతీయ రహదారి 61 పై ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. బస్సులో మొత్తం 29 మంది ప్రయాణికులు ఉండగా 19 మందికి గాయాలయ్యాయి. నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆర్టీసీ బస్ డ్రైవర్ లతీఫ్ కాలు విరిగింది. కండక్టర్ సుధారాణికి కూడా కాలు విరగడంతో పాటు స్వల్ప గాయాలయ్యాయి. లారీ క్లీనర్ మొహినొద్దీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ కృష్ణ జిల్లా కంచికచర్ల గ్రామానికి చెందిన గజ్జెల శ్రీను గంట పాటు క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. ఎక్స్‌కవేటర్ సహాయంతో స్థానికులు, పోలీసులు బయటకు తీసి అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా, భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ పరిశీలించారు. నిర్మల్ డిపో మేనేజర్ పండరి ఆర్టీసీ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న సిబ్బంది, ప్రయాణికులకు దగ్గర ఉండి చికిత్స చేయించారు. కాగా, నిర్మల్ ఆర్టీసీ డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ వీజీ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నర్సాపూర్ (జీ) ఎస్ఐ తెలిపారు.


క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ శ్రీను


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న భైంసా, నిర్మల్ ఏఎస్పీలు అవినాశ్ కుమార్, రాజేశ్ మీనా